క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఇందిరానగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు. 11కేవీ సచివాలయం ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అటెండెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలంటూ వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

కందుకూరు: మండలంలో సమగ్ర సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ సరితకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు కే.రవి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.బుగ్గరాములు మాట్లాడుతూ.. గతేడాది నవంబర్ నెలలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల గణన సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులు సాధారణ సెలవు దినాల్లో కూడా పనిచేశారన్నారు. వారందరికీ అటెండెన్స్ సర్టిఫికెట్ జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బిక్యానాయక్, వి.మహేశ్, బి.జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలు ప్రశాంతతకు నిలయాలు

గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు



కుర్మిద్దలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ కృష్ణంరాజు, ఎస్ఐ తేజంరెడ్డి తదితరులు

యాచారం: గ్రామాలు ప్రశాంతతకు నిలయాలని.. గంజాయి, డ్రగ్స్ అమ్మకాలపై ప్రజలే అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణం రాజు అన్నారు. బుధవారం ఠాణా పరిధిలోని కుర్మిద్దలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో కొత్త వ్యక్తుల సంచారం.. చోరీలు, గంజాయి, డ్రగ్స్ అమ్మకాలపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని.. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని తెలిపారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తేజంరెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధి అభినందనీయం

తుర్కయంజాల్: హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని అపెక్స్ బ్యాంకు అధ్యక్షులు, డైరక్టర్లు, సీనియర్ సిబ్బంది బృందం బుధవారం తుర్కయంజాల్‌లోని రైతు సేవా సహకార సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సంఘం అభివృద్ధికి చేపట్టిన చర్యలు, పని విధానాన్ని, రైతుల కోసం చేపడుతున్న చర్యలపై వివరించారు. బీఎన్‌రెడ్డి నగర్, కొహెడలోని బ్రాంచి కార్యాలయాలు, గోదాంలను పరిశీలించారు. సంఘం అభివృద్ధిని చూసి సత్తయ్యను అభినందించారు.

లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించండి

మంచాల: గతంలో గుర్తించిన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు కంభాలపల్లి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన లింగంపల్లి, నోముల, మంచాల గ్రామాలకు చెందిన లబ్ధిదాలతో కలిసి మంచాల మండల కార్యాలయంలో సూపరింటెండెంట్ మహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. లింగంపల్లి గేట్ వద్ద గత ప్రభుత్వం 96 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించిందని.. గ్రామ సభలు పెట్టి లాటరీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసిందని గుర్తు చేశారు. 16 నెలలు అవుతుతున్నా.. ప్రభుత్వం మారినా లబ్ధిదారులకు మాత్రం ఇళ్లు అప్పగించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇళ్ల పంపిణీ చేపట్టాలని కోరారు.

వివాదాస్పదంగా నాలా సమస్య!

- నాలాకు అడ్డుపడి ఆపింది బీజేపీ నాయకులే అని బీఆర్ఎస్ ఆరోపణ
- రోజురోజుకు అగ్గి రాజుకుంటున్న డ్రైనేజీ సమస్య
- గందరగోళంలో శివసాయినగర్ కాలనీవాసులు



ఆగిన ఎస్ఎన్‌డీపీ నాలా పనులు, రివర్స్ వస్తున్న మురుగునీరు

బడంగ్‌పేట్: కార్పొరేషన్‌కు కూతవేటు దూరంలో ఓ స్కూల్ ఎదురుగా ఉన్న ఎస్ఎన్‌డీపీ ట్రంక్‌లైన్‌కు కలిపే లింక్ విషయంలో గత కొన్నేళ్లుగా వివాదం కొనసాగుతూ వస్తోంది. కానీ ఇటీవల అన్ని పార్టీల మధ్య ఈ సమస్య రోజురోజుకు అగ్గి రాజుకుంటోంది. ఈ నాలాకే శివసాయినగర్ కాలనీకి చెందిన అవుట్‌లెట్ ఆధారపడి ఉంది. అరగంట కూర్చొని మాట్లాడుకుంటే తీరే సమస్యను వివిధ పార్టీల నాయకుల విమర్శలతో వివాదాస్పదంగా మారంది.

రెండేళ్లుగా..

కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్‌లో శివసాయినగర్ కాలనీ ఉంది. 20 ఏళ్ల క్రితం ఏర్పడిన కాలనీకి వెంచర్ చేసినవారు కాలనీకి సరిపడా సెప్టిక్ ట్యాంక్‌ను నిర్మించాడు. గత 18 ఏళ్లుగా మురుగు నీరు అందులోకి చేరుకోవడంతో ఏ సమస్య ఉండేది కాదు. రెండేళ్లుగా ప్రైవేట్ స్థలంలో మట్టిని పోసి నింపడంతో గతంలో వేసిన మురుగునీటి పైప్‌లైన్లతో పాటు సెప్టిక్ ట్యాంక్ కూడా మునిగిపోయింది. ఇక కాలనీకి అప్పటి నుంచి కష్టాలు షురూ అయ్యాయి. ఇప్పుడు కాలనీకి అవుట్‌లెట్ బయటకు పోవాలంటే ప్రైవేట్ ల్యాండ్ మీదుగా యూజీడీ వేయాల్సి ఉంది. మా ప్లాట్ల మధ్య నుంచి అవుట్‌లెట్ కుదరదని ల్యాండ్ దారులు చెప్పుకుంటూ వస్తున్నారు. అంతకుముందు కొనసాగిన ఓపెన్ నాలాను ల్యాండ్‌దారులు మూసివేసి మట్టి పోశారు. ఈ విషయంలో ఇరిగేషన్ అధికారులు కేసులు కూడా నమోదు చేశారు. ఇళ్లల్లోకి మురుగునీరు వచ్చి చేరుతుండటంతో శివసాయినగర్ కాలనీ డ్రైనేజీ, ఎస్ఎన్‌డీపీ నాలా సమస్యలు వివాదాస్పదంగా మారాయి. రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వచ్చి ఏళ్ల నుంచి వస్తున్న వరద కాలువను పరిశీలించారు. వరనీరు, డ్రైనేజీ ఒక దిక్కు నుంచి వెళ్లేలా సహకారం అందించాలని కోరినా ససేమీరా అని ల్యాండ్‌దారులు అంటున్నారు. వరద కాలువ మూసి వేయడంతో పాటు కాలనీ సెప్టిక్ ట్యాంక్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటారా? లేక వారితో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తారా అనేది ప్రశ్నగా మిగిలింది.

సమస్య పక్కదారి..

ఎస్ఎన్‌డీపీ నాలాకు లింక్ కలపడంలో బీఆర్ఎస్ నాయకులు విఫలమయ్యారని, బీజేపీ నాయకులు, 13వ డివిజన్ కాంగ్రెస్ కార్పొరేటర్ ఆధిపత్యం వహించి ఎందుకు సహకారం అందించలేదని బీఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఒక్కటై సమస్యలు పక్కదారి పట్టిస్తున్నారు. బీజేపీ నాయకులు స్థానికంగా ఆరోపణలు చేసుకుంటూ ఏకంగా విషయం ప్రస్తుత ఎమ్మెల్యే, పోటీ చేసి ఓడిపోయిన నాయకుల వరకు చేరి ఒకరి మీద ఒకరూ వ్యక్తిగత విమర్శలు చేసుకునే స్థాయికి చేరుకుంది.

ఒకరిపై ఒకరు విమర్శలు

బడంగ్‌పేట కార్పొరేషన్‌ను వేలకోట్లతో అభివృద్ధి చేశామని, నేడు అధికారం కోల్పోయామని కేంద్రంలో అధికారంలో ఉన్న రాజ్యసభ, పార్లమెంట్ నిధులను ఎందుకు కార్పొరేషన్‌కు మళ్లించలేకపోతున్నారని ఇక్కడి బీజేపీకి చెందిన నాయకులను బీఆర్ఎస్ ఘాటుగానే సవాల్ విసురుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ కార్పొరేషన్‌కు ఇప్పటివరకు ఒక్క రూపాయి అయినా కేటాయించారా? అని ప్రశ్నించారు. శివసాయినగర్ కాలనీ అవుట్‌లెట్, ఎస్ఎన్‌డీపీ ట్రంక్‌లైన్ మూసివేతకు బీజేపీ నాయకులే అసలు సూత్రదారులు అనే విషయాన్ని పక్కదోవ పట్టించేందుకు ధర్నాల పేరుతో నాటకాలు ఆడుతున్నారని బీజేపీ వ్యవహార శైలీని బీఆర్ఎస్ నాయకులు తప్పుపడుతున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకోవడం చూస్తున్న అధికారులు మాకెందుకు వచ్చిన తలకాయనొప్పి అని మిన్నకుండిపోతున్నారు. ఏళ్లనుంచి పడుతున్న ఇబ్బందులు ఎప్పుడు తీరుస్తారో అని ప్రజలు, కాలనీవాసులు మాత్రం కళ్లల్లో ఒత్తులు వేసుకొని ఎదురుచూస్తున్నారు.

ఎమ్మెల్యేను లాగడం సరికాదు



బడంగ్‌పేట కార్పొరేషన్‌కు సాధారణ నిధులతో పాటు వరదల నియంత్రణకు రూ.58 కోట్లు, హెచ్ఎండీఏ, స్పెషల్ ఫండ్, 15, 16 ఆర్థిక సంఘం నిధులు, నాటి సీఎం కేసీఆర్‌ను ఒప్పించి 250 కోట్ల నిధులను మంజూరి చేయించి అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి చొరవ తీసుకుంది. కొన్ని కారణాలతో ఆగిన అవుట్‌లెట్, ఎస్ఎన్‌డీపీ నాలా లింక్‌ను అడ్డం పెట్టుకొని ఎమ్మెల్యేను వ్యక్తిగతంగా దూషించడం బీజేపీ, కాంగ్రెస్‌కు మంచిది కాదు. ఐదేళ్ల పాలించిన కాంగ్రెస్ మేయర్ ఎందుకు పట్టించుకోలేదు? అన్ని పార్టీల సమన్వయంతో ఈ సమస్యకు పరిష్కారం చూపుతాం.

– రామిడి రాంరెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు

త్వరలో పరిష్కారం చూపుతాం



సమస్యగా మారి అన్ని పార్టీలకు రుద్దుకుంటున్న ఈ విషయాన్ని త్వరలో పరిష్కరించే మార్గాన్ని తీసుకొస్తాం. అన్ని పార్టీల నాయకులు, స్థానికులను సమన్వయం చేసుకొని భూ యజమానులతో మాట్లాడి సమస్యకు చెక్ పెడతాం. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సలహాలు కూడా తీసుకొని పరిష్కారమయ్యేలా చూస్తాం.

–పి.సరస్వతి, కమిషనర్

ఫంక్షన్‌హాలులో ఎలాంటి నాలా లేదు

ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆనంద్‌రెడ్డి

బడంగ్‌పేట్: పెద్దబావి మల్లారెడ్డి ఫంక్షన్‌హాలును ఎలాంటి నాలాను ఆక్రమించి నిర్మించలేదని, కబ్జాలు చేసి నిర్మించారన్న విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంపీటీసీ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్దబావి ఆనంద్‌రెడ్డి అన్నారు. బుధవారం బడంగ్‌పేటలోని గార్డెన్‌లో నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2007లో జీపీ అనుమతితో మల్లారెడ్డి పేరుతో ఫంక్షన్‌హాలు నిర్మించి 2009లో ప్రారంభించామన్నారు. గాంధీనగర్ దగ్గర ఉన్న తుర్కదానికుంట నుంచి వరదనీరు, వాననీరు పొలాల గుండా పారుతూ బడంగ్‌పేట్ ప్రధాన రహదారిలో నిర్మించిన కల్వర్టు కింద మత్తడి దాటుతూ కాశీబుగ్గ ఆలయం మీదుగా శివనారాయణపురం కాలనీ దాటుతూ పెద్ద చెరువుకు చేరుకునేది. ఈ కాలువ చాలా సంవత్సరాలు కొనసాగింది. రెండేళ్ల క్రితం వరద కాలువను మట్టితో నింపేయడం కారణంగా ఈ సమస్య తలెత్తిందని పేర్కొన్నారు. ఆ వరద కాలువను బీజేపీ నాయకులు మట్టిపోసి మూసివేశారని ఆరోపించారు. శివసాయినగర్ కాలనీకి చెందిన సెప్టిక్‌ట్యాంక్‌ను కూడా బీజేపీ నాయకులు మట్టితో మూసివేయడంతో కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. 20 ఏళ్ల క్రితం సైకిల్‌పై పాలు అమ్మిన అందెల శ్రీరాములు కల్వర్టు మీద నుంచి రోజు వచ్చేవాడన్న సంగతి మరిచిపోయాడా అని నిలదీశారు. బీజేపీ నాయకులే మట్టిని పోసి, తిరిగి వారే ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. నాలాకు ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేకున్నా బట్టకాల్చి మీద వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలాపై ఫంక్షన్‌హాలు నిర్మించారని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. అందుకు సంబంధించిన లేటెస్ట్ శాటిలైట్ల చిత్రాలను చూపించారు. అందెల శ్రీరాములు జాగ్రత్తగా మాట్లాడటం నేర్చుకోవాలని హెచ్చరించారు. ఎమ్మెల్యే సబితారెడ్డిని విమర్శిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, భీమిడి జంగారెడ్డి, రాజు, కర్రె కృష్ణ, మహేందర్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.



విలేకరులకు శాటిలైట్ చిత్రాలను చూపుతున్న ఆనంద్‌రెడ్డి

ఘనంగా స్వయంపాలన

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నా రు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి మిత్రులకు పాఠాలు బోధించారు. అనంతరం బోధనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

ఎల్‌బీనగర్: అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. బుధవారం హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో డీసీ తిప్పర్తి యాదయ్య, ఈఈ ఆశలతతో కలిసి ఆయన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..కాలనీల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



కాలనీలో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్, అధికారులు

ఎల్‌బీనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



పనులు ప్రారంభిస్తున్న మధుయాష్కీగౌడ్

హస్తినాపురం: ఎల్‌బీనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. హస్తినాపురం డివిజన్ సప్తగిరిహిల్స్ కాలనీలో రూ.65 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను బుధవారం ఆయన స్థానిక కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా అధికారంలో ఉన్నవాళ్లు నియోజకవర్గం అభివృద్ధి గురించి పట్టించుకోలేదని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో నిధులు మంజూరుచేసి అభివృద్ధి చేస్తుంటే రాజకీయాలు చేస్తూ అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాల కబ్జాలు, ఆక్రమణలతోనే ఇన్నాళ్ల పాలన సాగించిన కొందరు నాయకులు అభివృద్ధి పనుల విషయంలో రాజకీయాలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. గతంలో సప్తగిరిహిల్స్ కాలనీ వాసులకు రోడ్లు, డ్రైనేజీ కోసం అడిగితే నిధులను మంజూరు చేయకుండా ప్రజాప్రతినిధులం అని చెప్పుకునే నాయకులు ఇబ్బందులు పెట్టారని కానీ తమ ప్రభుత్వం కాలనీల్లోని సమస్యలు తీర్చేందుకు నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, నాయకులు శశిధర్‌రెడ్డి, నర్సింహ్మయాదవ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌యాదవ్, డేరింగుల కృష్ణ, దాము మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

సెక్షన్ 106ను రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

హయత్‌నగర్: డ్రైవర్ల పాలిట శాపంగా మారిన భారతీయ న్యాయ సంవిధాన్ సెక్షన్ 106(1), (2)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం హయత్‌నగర్ కుంట్లూర్ రోడ్డులో ఆటో డ్రైవర్‌లు ఆందోళన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి హాజరూ మాట్లాడారు. సెక్షన్ 106 అభద్రతా భావంతో డ్రైవర్‌లు ఆవేదన చెందుతున్నారని, ఈ సెక్షన్‌ను రద్దు చేసి రవాణా వ్యవస్థను కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్టు యూనియన్ సిల్లా అధ్యక్షులు రాములు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యంగిరా దేవి ఆలయ బ్రహ్మోత్సవాలు



ప్రత్యంగిరా దేవి అన్నాభిషేకం చేస్తున్న అర్చకులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అమ్మవారి జ్ఞాపికను అందజేస్తున్న మునిపల్లె శ్రీనివాస్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని కుర్తాళ పీఠం ప్రత్యంగిరా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. బుధవారం ఆలయంలో కుర్తాళ పీఠ ఆస్థాన పండితులు బ్రహ్మశ్రీ మాచవోలు రమేష్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యంగిరా అమ్మవారికి అన్నాభిషేకం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ప్రత్యంగిరా దేవికి నిర్వహించిన మహా నక్షత్ర హారతులు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్, మల్‌రెడ్డి రాంరెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, పున్న గణేష్‌నేత, ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్, మునిపల్లె సువర్ణ లత, విఠల్ శర్మ, హేమంత్ శర్మ, శ్రీపతి, అన్నపూర్ణ, హేమ, దేవి, హిమబిందు పాల్గొన్నారు.



మహేశ్వరం: నాగిరెడ్డిపల్లిలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కందుకూరు: శివాజీ మహారాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



తుక్కుగూడ: జయంతి వేడుకల్లో పాల్గొన్న యువకులు

ఆదర్శప్రాయుడు ఛత్రపతి శివాజీ

యువత వీర శివాజీ మహారాజ్ ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం మహేశ్వరం నియోజకవర్గంలో హిందూవాహిని, బజరంగ్‌దళ్, ఆరె కటికె సంఘాలు, వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలీలు నిర్వహించారు.



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి



పహాడీషరీఫ్: శ్రీరాం కాలనీలో నివాళులర్పిస్తున్న యువకులు



మీర్‌పేట: జిల్లెలగూడలో..